# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలిసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

## ‘పద్మశ్రీ’ల మనోభావాలు



### రాముడిచ్చిన కానుకే పద్మశ్రీ

జనగామ జిల్లాలోని మారుమూల పల్లెటూరు అప్పిరెడ్డిపల్లిలో పుట్టిపెరిగిన నాకు కులవృత్తి చిందు యక్షగానమే సర్వస్వం. ‘సమ్మయ్య నువ్వు పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యావు’ అని చెప్తే మొదట నమ్మలే. అయోధ్య రామాలయంలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా యక్షగానంలో రామాయణాన్ని ప్రదర్శించాం. ఆ శ్రీరాముడే మెచ్చి ఇచ్చిన కానుకే ఈ పద్మశ్రీ పురస్కారం. - గడ్డం సమ్మయ్య (యక్షగానం)



### బుర్రకళకు పూర్వ వైభవం

మా తాతల కాలం నుంచి అందరం బుర్రకళనే నమ్ముకున్నాం. బలగం సినిమాలోని ‘అయ్యో శివుడా! వెనుకట దానికి సరిపోయే..’ పాటతో గుర్తింపు వచ్చింది. ప్రాచీన కళను నేర్చుకునేందుకు నేటితరం ఆసక్తి చూపడం లేదు. పద్మశ్రీ అవార్డు రావడం సంతోషంగా ఉంది. ఇలాంటి అవార్డులతో అంతరించిపోతున్న కళకు పూర్వ వైభవం వచ్చినట్టయింది. - దాసరి కొండప్ప (బుర్రకళ)



### జన్మభూమికి అంకితం

పద్మశ్రీకి ఎంపికవడం నా జీవితంలో అపూర్వ ఘట్టం. మారుమూల పల్లెలో నేను చేస్తున్న సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఈ అవార్డుతో నా బాధ్యత మరింత పెరిగింది. నేటి యువత సాహిత్యంపై అభిరుచి పెంచుకొని, సమాజాన్ని చైతన్యపరిచే రచనలు చేయాలి. నా జన్మభూమికి అవార్డును అంకితమిస్తున్నా. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. - కూరెళ్ల విఠలాచార్య (సాహిత్యం)



### లంబాడీల విజయమిది

లంబాడీ సాహిత్యంలో నా సేవలను గుర్తించిన కేంద్రానికి కృతజ్ఞతలు. తండా నుంచి మొదలైన సాహిత్య ప్రయాణం ఢిల్లీ వరకు చేరడం, లంబాడీ తండాల మట్టి పరిమళాలకు దక్కిన అతిపెద్ద విజయం. లంబాడీ భాషలో రచించిన భగవద్గీతను ప్రచురించేందుకు చాలా కష్టపడ్డా. పద్మశ్రీ అవార్డుతో లంబాడీల సాహిత్యం కొత్త మలుపు తిరిగింది. - కేతావత్ సోమ్‌లాల్ (లంబాడీ సాహిత్యం)



### దేవుడిచ్చిన బహుమానం

నా బాల్యమంతా ఆకలి మంటల మధ్యనే గడిచింది. గంజి తిని పెరిగాను. నాకొచ్చిన ప్రతీ అవకాశాన్ని దేవుడిచ్చిన కార్యంగా భావించాను. శిల్పకళలో ఎప్పుడూ వినూత్నంగా ఆలోచించే వాణ్ని. పద్మశ్రీ వరించడం చాలా సంతోషంగా ఉంది. ప్రతీ పనిని సవాల్‌గా స్వీకరించి, అద్భుత ఫలితాలు రావాలనే ఆకాంక్షతో పనిచేయడమే నాకు గుర్తింపును తీసుకొచ్చింది. - ఆనందాచారి వేలు (శిల్పకళ)


# రంగుల లిపితో రాసిన కవితలు కొండపల్లి బొమ్మలు





కొండపల్లి శేషగిరిరావు
జనవరి 27న శతజయంతి





‘గీత నా ప్రాణపల్లవి
కాంతికల్పనా క్రాంతి పథము
దృక్కుదృశ్యమ్ము అమృత దీపమ్ములిచట
మధ్య శూన్యంబు రూప ప్రస్థానయాత్ర’

సుమారు అయిదు దశాబ్దాల కిందట అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ తన రూపాన్ని తానే స్కెచ్ వేసుకుని పై కవితను రచించారు ప్రముఖ చిత్రకారులు స్వర్గీయ డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు.


ఏ కళైనా వీక్షకులకు ఆనందాన్ని కలిగించడమే కాదు, మానసికోల్లాసాన్ని, చైతన్యాన్నీ కలిగించగలిగితే ఆ కళ పరమ లక్ష్యం నెరవేరినట్టే. ఆ కళాకారుడికి అంతకన్నా సంతృప్తి మరొకటి ఉండదు. తెలంగాణా గడ్డ మీద పుట్టి కళారాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయులెందరో ఉన్నారు. చిత్రకళలో అసమాన ప్రతిభను కనబరచి ఆ సాధనలో శిఖరాలను అందుకున్న గొప్ప చిత్రకారులలో ముందు వరుసలో ఉండదగినవారు డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు.

తానే స్వయంగా ఒక వ్యాసంలో శేషగిరిరావు చెప్పినట్టు.. ‘చిత్రకళ ఒక భాష. రంగులు, రూపాలు దాని లిపి. ఈ లిపితో వ్యక్తీకరించు భావాలే కవిత్వం.’ అయితే, సృజనకారుడికి ఆ భాషా, లిపీ తెలిసి ఉండడమే కాదు, అందులో నిష్ణాతుడై ఉండాలి. ముఖ్యంగా చిత్రకారులు సృజించిన రూప్య, నైరూప్య చిత్రాలలో అలాంటి జీవమున్న కవిత్వం తొణికిసలాడాలి. ఆ సుకవిత్వాన్ని వీక్షకులు అర్థం చేసుకోవాలి కూడా. అలాంటి చిత్రకళా రస భాష పరిపూర్ణంగా తెలిసిన గొప్ప చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు.

ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ తాలూకా పెనుగొండ గ్రామంలో సంప్రదాయ కుటుంబంలో, గోపాల్ రావు, రామచూడమ్మ దంపతులకు జన్మించిన శేషగిరిరావు చదువుకోవడానికే ఎంతో కష్టపడాల్సి వచ్చింది. అప్పటికీ, ఇప్పటికీ కూడా చిత్రకళ అభ్యాసం, నిరంతర సృష్టి ఎంతో ఖర్చుతో కూడుకున్నదే. ఈ కళను వృత్తిగా స్వీకరించడానికి ఇతరత్రా ఆదాయం, ఆర్థిక స్తోమత ఉన్నవారికి తప్ప మామూలు వారికి కష్టమే. బ్రష్‌లు, రంగులు, కాన్వాస్, అవి ఉంచడానికి సరిపడా మంచి చోటు.. ఇవన్నీ మామూలు



వారికి అందని ద్రాక్షలే. అయినప్పటికీ పాఠశాల విద్యను ఉర్దూ మీడియంలో పూర్తి చేసిన శేషగిరిరావు.. చిత్రకళపై ఉన్న తీవ్రమైన మక్కువ వల్ల హైదరాబాద్‌లో 1940లో స్థాపింపబడిన గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ లో మొదటి బ్యాచ్ విద్యార్థిగా చేరి చిత్రకళను అభ్యసించారు. యుక్తవయసులోనే చిత్రాలు గీయడంలో నైపుణ్యత సాధించి సంతాల్, హార్మనీ, కాకులు వంటి తన చిత్రాలకు ప్రముఖ చిత్రకారులతో పోటీపడి బహుమతులు సాధించారు.



నవాబ్ మెహదీ నవాజ్ జంగ్ బహదూర్ సహకారంతో రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన శాంతినికేతన్‌లోని కళాభవన్‌లో 1946లో చేరి నందలాల్ బోస్ వద్ద చిత్రకళను అభ్యసించారు. అక్కడ ఉన్న సమయంలో ప్రకృతి చిత్రణలోనూ, పౌరాణిక మూర్తుల చిత్రణలోనూ ప్రావీణ్యత సాధించారు. ముఖ్యంగా బెంగాలీ సంప్రదాయ చిత్రణ, చైనీస్ వాటర్ కలర్ పెయింటింగ్‌లోనూ, జపనీస్ చిత్రకళలోనూ నిష్ణాతులయ్యారు. కొంతకాలం పాటు రాజస్థాన్‌లోని బనస్థలి విద్యాపీఠ్‌లో చిత్రకళను అభ్యసించారు. హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ ఆర్ట్ (ప్రస్తుతం కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్)లో లెక్చరర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి, ప్రొఫెసర్‌గా పదవీ విరమణ పొందేదాకా వివిధ స్థాయిల్లో పనిచేశారు.

పౌరాణిక పాత్రలు, సందర్భాలు, చారిత్రక ఘట్టాలు చిత్రీకరించడానికి ఆయా పురాణ, చరిత్ర గ్రంథాలు అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అప్పటివారి వేషభాషలు, అలవాట్లు.. మొత్తంగా ఆనాటి సంస్కృతి ఆయా చిత్రాల్లో ప్రతిబింబించాలి. ప్రతి చిత్రానికీ ఎంతో శ్రద్ధ తీసుకుని గీసే అలవాటు శేషగిరిరావుది. విస్తృత పర్యటన, నిరంతర అభ్యాసం ఆయనను ఉత్తమశ్రేణి చిత్రకారునిగా తీర్చిదిద్దాయి. పౌరాణిక చిత్రాల కోసం ఆయన రామాయణ, భారత, భాగవత గ్రంథాలనూ, అభిజ్ఞాన శాకుంతలం వంటి కావ్యాలనూ, హనుమకొండలోని వెయిస్తంభముల దేవాలయం, పాలంపేట రామప్పగుడి, కొలనుపాక, నాగార్జున కొండ, లేపాక్షి, తాడిపత్రి, సోమపాలెం, హంపి, తంజావూరు, మధుర, శ్రీరంగం, రామేశ్వరం, సాంచి, సారనాథ్, అజంతా ఎల్లోరా శిల్పాలనూ ప్రత్యేక శ్రద్ధతో, విమర్శనా దృష్టితో అధ్యయనం చేసి చిత్రాలు గీయడంతోబాటు అనేక వ్యాసాలు రచించారు.

కవుల్లో పోతన అంటే శేషగిరిరావుకు ప్రత్యేక అభిమానం. వానమామలై వరదాచార్యులు రచించిన పోతన చరిత్రము కావ్యంలోని 14 ఘట్టాలకు ఆయన వేసిన చిత్రాలు అత్యద్భుతంగా ఉండడమే కాక చిరకాలం నిలిచిపోతాయి. బమ్మెరలోనూ, ఓరుగల్లులోనూ పోతన పంచ శత జయంతి ఉత్సవాలు జరిపినప్పుడు ఆ కమిటీ వారి కోరిక మేరకు శేషగిరిరావు చిత్రించిన పోతన పోర్ట్రయిట్ ఇప్పటికీ సాధికారికంగా పోతన బొమ్మగా వాడుతున్నారు. చివరకు శిల్పులు కూడా పోతన విగ్రహం చెక్కాల్సి వస్తే దాన్నే అనుసరిస్తున్నారు . అదేవిధంగా 1975లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఆయన చిత్రించిన ‘తెలుగు తల్లి’ విగ్రహం కూడా బహుళ జనాదరణ పొందింది. వీరి చిత్రాలలో భద్రాచల రామదాసు, విజయనగర సామ్రాజ్య స్థాపన, పోతనకు సరస్వతీ దేవి సాక్షాత్కారం, అహల్యా శాపవిమోచనం, కథా కాలక్షేపం, గడ్డి మోపునెత్తుకున్న పల్లె పడుచు, జంటలేళ్ళు వంటి చిత్రాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి.

జానపద చిత్ర రంగానికి శేషగిరిరావు చేసిన కృషి, సేవ ఎంతో గొప్పవి. జనగామ ప్రాంతంలోని చేర్యాలలో మరుగున పడిపోతున్న తెలంగాణ పట చిత్రాలైన కాకి పడగలను గుర్తించి లలితకళా అకాడమీ వారిని ఒప్పించి ఆ అట్టడుగు వర్గాల కళను వెలుగులోకి తెచ్చారు.

ప్రకృతి దృశ్యాలు, పక్షులు, జంతువులు, శిలలు, చారిత్రక ప్రదేశాలు వంటివి చిత్రీకరించడంలో ఆయన ప్రత్యేక ఆసక్తి చూపేవారు. హర్షచరిత్ర, క్రీడాభిరామం గ్రంథాల్లోని సున్నిత అంశాలను చిత్రకళకు సమన్వయం చేసి చూపడం వీరి ప్రత్యేకత.

ఆయనలో మంచి చిత్రకారుడే కాక గొప్ప అధ్యాపకుడు న్నాడు. చిత్రకళకు సంబంధించిన రంగుల ఎన్నిక, మేళవింపు, పాత్ర స్వభావాన్ని, మూడ్‌ని, స్థలకాలాల్ని, సంప్రదాయాల్ని గురించిన అవగాహన, చిత్రీకరణలో మెలకువలకు చెందిన విజ్ఞానం, బోధనా ప్రావీణ్యత మాత్రమే కాక ఎన్నో సాంకేతిక అంశాలు శేషగిరిరావు గారికి క్షుణ్ణంగా తెలుసు. ఆయన మంచి కవి, రచయిత కూడా. చిత్రకళకు సంబంధించిన ఎన్నో అంశాలపై విలువైన వ్యాసాలు రాశారు. తమ సమకాలీన చిత్రకారులైన కాపు రాజయ్య, పీటీ రెడ్డి వంటి వారి ప్రత్యేకతల గురించి, ఇతర ప్రముఖుల గురించి కూడా పదుల సంఖ్యలో వ్యాసాలు రచించిన సహృదయత, వైదుష్యం ఆయనది.



నెల్లుట్ల రమాదేవి

బ్రిటిష్ పరిపాలన మన పూర్వ విజ్ఞానాలన్నీ మనకు లేకుండా చేసిందనీ, చిత్రకారులంతా కుంచెలు, రంగుల వంటి వస్తువులను దిగుమతి చేసుకోవడానికి అలవాటు పడ్డారనీ, విదేశీయ ఆయిల్‌కలర్ బ్రష్‌లు, వాటర్‌కలర్ బ్రష్‌లు మన దేశ సంప్రదాయ రేఖాచిత్రకళా శైలినే మార్చేసిందని ఆయన అనుభవపూర్వకమైన అభిప్రాయం. మన ఉడుత వెంట్రుకలతో ఉత్తమమైన బ్రష్‌లు తయారుచేయవచ్చనీ, ప్రాచీన చైనా చిత్రకారులు ఎలుక మీసాలతో చేసిన బ్రష్‌లు వాడేవారనీ, నల్లసిరా, కర్పూరపు మసితో కలిపిన రంగుల మేళవింపుతో మన దేశంలో చిత్రకారులు అద్భుత చిత్రాలను సృజించారనీ ఆయన ఎన్నో వ్యాసాలలో పేర్కొన్నారు. వాటర్ పెయింటింగ్‌లో ‘ఆక్వా టెక్చర్ ’ అనే ప్రత్యేక విధానాన్ని ఆయన ప్రవేశపెట్టారు.

శేషగిరిరావు మంచి కార్టూనిస్ట్ కూడా అనే విషయం చాలామందికి తెలియదు. సన్నని రేఖల్లో హావభావాలు ప్రకటింపజేయడం ఆయన ప్రత్యేకత. తెలంగాణా సాయుధ పోరాట సమయంలోనూ, అంతకు ముందు రోజుల్లోనూ ఆయన చిత్రించిన రాజకీయ వ్యంగ్య చిత్రాలు చురుక్కుమనిపించేలా ఉంటాయి. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు కూడా.

శేషగిరిరావు ప్రతిభకూ, చిత్రకళారంగానికి వారు అందించిన అమూల్య సేవలకూ ఎన్నో సాహిత్య సాంస్కృతిక సంస్థలు బిరుదులతో, పురస్కారాలతో సత్కరించాయి. 1996లో వారిని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. డాక్టర్ సి. నారాయణ రెడ్డి గారు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఆయనకు ప్రతిష్ఠాత్మక ‘హంస’ అవార్డు లభించింది. హైదరాబాద్, మైసూర్, మద్రాస్ ఆల్ ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్స్ వారి పురస్కారాలు, ఏపీ లలితకళా అకాడమీ, కలకత్తా ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సత్కారాలు, సారస్వత పరిషత్, ప్రపంచ తెలుగు మహాసభల కమిటీ వారి సన్మానాలు పొందారు.

దేశ, విదేశాలకు చెందిన ప్రాచీన, ఆధునిక చిత్రకళా రీతులను సమగ్రంగా అవగాహన చేసుకున్న చిత్రకారుడు, పరిశోధకుడు, సామాజిక, సాహితీవేత్త డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు వైదుష్యాన్ని కేవలం ఒక వ్యాసంలో పేర్కొనడమంటే ఏనుగును ఒక చిన్న సీసాలో పెట్టడమే! ఈ జనవరి 27న వారి శతజయంతి సందర్భంగా సంస్మరించుకోవడం కళాభిమానులందరి కర్తవ్యం.


‘మహోన్నతమైన కళ ఎన్నటికీ వృత్తి కాజాలదు. అది కేవలం ఆత్మవ్యక్తీకరణ మాత్రమే. దానికి ప్రతిఫలాకాంక్ష లేదు. కళకు ఆనందమే పరమావధి. నేత్రానందముతో బాటు మానసికానందము కల్గించినపుడే కళ సార్థకమౌతుంది ’ అని చెప్పిన గొప్ప వ్యక్తి, చిత్రకళా తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు గారికి నివాళి !!

# సరిహద్దులు చెరిపి చదవాల్సిన పుస్తకం

అసలు యే సరిహద్దులనైనా చెరిపేసుకోగల గటం సాధ్యమా.. అసలు అనేక విషయాలకు యే సరిహద్దులు లేని కాలమొక్కటుందా! కల్లూరి భాస్కరం గారి కొత్త పుస్తకం ‘ఇవీ మన మూలాలు’ మనకు యిలాంటి సందేహాలు... సంశయాలు... కుతూహలాలపై కొత్త వెలుగు ప్రసరిస్తుంది.

ముఖ్యంగా, మానవ వలసలు యెప్పుడు, యెక్కడ, యెలా మొదలయ్యాయి? యే అన్వేషణ, యే జీవితావసరం మానవులను నిరంతరం వలస బాటని పట్టించాయి? ఆధునిక వలసలకు జన్యుపరంగా జరిగే మార్పులకు, మూలాలకు నడుమ యే విధమైన సంబంధం వుంది? మెహర్‌గఢ్ లాంటి చోట వ్యవసాయం మొదలైన కాలం నుంచి హరప్పా నాగరికత విచ్ఛిన్నమైన తర్వాత యే నాగరికత ప్రస్ఫుటంగా ముందుకొచ్చింది? మొదలైన విషయాలను తెలుసుకోవాలన్న ఆసక్తిని కలిగించటంతో యీ పుస్తకం మనందరికీ సంబంధించినది, అందరం చదవాల్సింది. భారతీయులమైన మనందరి మూలాలూ పూర్తిగా మనం పుట్టిపెరిగిన ప్రాంతంలోనో, మన దేశంలోనో, మన ఖండంలోనో లేవంటారు యీ రచయిత. యెక్కడో పుట్టి, యింకెక్కడికో వలస కట్టి, యెన్నో సమూహాలతో సాంకర్యం చెంది యిప్పుడు ప్రపంచం అంతట్లోనూ వ్యాపించిన యేడు వందల కోట్లను మించిన మానవజనాభాతో మనది విడదీయలేని బంధమంటారు. యీ రోజున మనం దేశం, ప్రాంతం, మతం, కులం, భాష వంటి రకరకాల సరిహద్దుల్లోనూ, హద్దుల్లోనూ జీవిస్తున్నాం. కానీ యీ పుస్తకంలో రచయిత చూపారు యిలాంటి హద్దులేమీ యెరుగని ప్రపంచాన్ని! మనిషి మొత్తం భూగోళాన్నే తన హద్దుగా చేసుకున్న కాలాన్ని!

యీ పుస్తకం మన కళ్లముందు అన్నివైపులా అనేక కొత్త కిటికీలు తెరిచి మనకు తెలియని, మనం వూహించి కూడా వుండని వో అద్భుత ప్రపంచాన్ని చూపిస్తుంది. మన జన్యు మూలాలే కాదు; మన భాషలు, మత విశ్వాసాలు, సంస్కృతులు, వాఙ్మయాల మూలాలు కూడా మన దేశాన్ని, ప్రాంతాన్ని దాటి యెక్కడెక్కడ వున్నాయో చూపించే యీ





పుస్తకం మరింతగా మనల్ని మూలాల్లోకి పట్టుకుపోతుంది.

మన వేదాలు, యితిహాసాలు, పురాణాల్లో కనిపించే పాత్రల పేర్లు, వారు వ్యవహరించే శైలి, వారు పట్టుకునే ఆయుధాలు, వారు తిరిగిన రథాల వెనుక మన దేశ సరిహద్దులను దాటి విస్తరించిన చరిత్రను కళ్లకు కట్టిస్తుంది.

మొదటినుంచీ పురాచరిత్ర, చరిత్ర, మానవశాస్త్రం, భాషాశాస్త్రంపై ఆసక్తి, అధ్యయనం వున్న భాస్కరం గారు మహాభారతం తన ఆసక్తులన్నింటికీ కేంద్రబిందువవ్వటంతో వారు జెనెటిక్స్‌లోకి కూడా తొంగి చూశారు. యెందుకంటే యీ రంగాలలోని అధ్యయనాలు యేం చెప్తున్నాయో, జెనెటిక్స్‌లో జరుగుతున్న పరిశోధనలు దాదాపు అదే చెప్తున్నాయి. ముఖ్యంగా పాపులేషన్ జెనెటిక్స్ వేల సంవత్సరాలుగా మనుషుల మధ్య జరుగుతూవచ్చిన సాంకర్యాల గురించీ, వలసల గురించీ శాస్త్రీయ ఆధారాలతో చెబుతోందనీ, ఆ విధంగా అవి మన వేద, యితిహాస, పురాణ కథలను కొత్త కోణంలో చూపిస్తూ వాటికి సరికొత్త సాక్ష్యాలను యెలా సమకూరుస్తున్నాయో యీ పుస్తకంలో చూపించానన్నారు.

మనిషి మనుగడకు సంబంధించిన ప్రతి విషయాన్నీ జెనెటిక్స్ తన పరిధిలోకి తీసుకోవడమే కాకుండా, చివరికి మన జన్యువారసత్వం స్త్రీ-పురుషుల మధ్య అసమానతల చరిత్ర కూడా యెలా వెల్లడిస్తోందో యెంతో ఆసక్తికరంగా వివరించారు.

మన భారత వుపఖండాన్నే తీసుకుంటే, పురుషుడికి సంబంధించిన వై-క్రోమోజోమ్‌లో యెంతో వైవిధ్యం కనిపిస్తుందనీ; అదే స్త్రీకి చెందిన మైటోకాండ్రియల్ డీయెన్యేలో వైవిధ్యం కనిపించదనీ, ఆ విధంగా భారత వుపఖండం పురుషుడికి చాలావరకు అత్తిల్లు అయితే, స్త్రీకి పుట్టిల్లు అంటారు. జన్యుపరిశోధనల వెలుగులో మహాభారతాన్ని చదివినప్పుడు మరెన్నో ఆశ్చర్యకరమైన విశేషాలు మన దృష్టికి వస్తాయంటారు. అలాంటి యెన్నో విశేషాలను యీ పుస్తకంలో అందించారు కూడా.

లక్షలు, వేల యేండ్ల వెనుకటి మానవపరిణామ చరిత్రను మనముందు వుంచుతూనే, వర్తమాన రాజకీయ, సామాజిక సందర్భానికి వచ్చి ముగియడం యీ పుస్తకం ప్రత్యేకతలలో వొకటి. యెంతో వుత్కంఠను రేపుతున్న యీ పుస్తకం చదవడం చక్కటి అనుభవం. మన అజ్ఞాతమూలాలు తెలుసుకోవాలన్న ఆసక్తి వుంటే చాలు యీ పుస్తకంలోకి తొంగి చూడడానికి యింకెలాంటి అవగాహనా, అర్హతా వుండాలనిపించలేదు.



కుప్పిలి పద్మ
98663 16174

## ప్రకటన

### ‘లోపలి ముసురు’ ఆవిష్కరణ

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి మినీ హాలులో 2024 ఫిబ్రవరి 4న సాయంత్రం అరుణ నారదభట్ల రచించిన కవిత్వం ‘లోపలి ముసురు’ ఆవిష్కరణ కార్యక్రమం జరగనున్నది. డా.ఎన్.గోపి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. డా. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షత వహిస్తారు. డా.ఎస్. రఘు, డా.మామిడి హరికృష్ణ. డా.యాకూబ్, మెర్సీ మార్గరేట్ ఆత్మీయ అతిథులుగా హాజరవుతారు. సాహిత్య మిత్రులందరికీ సాదర ఆహ్వానం.

### కవితా సంపుటాలకు ఆహ్వానం

ఉత్తమ వచన కవిత్వాన్ని ఆవిష్కరిస్తున్న కవులకు ఏటా ఇచ్చే పాలమూరు సాహితీ అవార్డులకు కవితా సంపుటాలను పాలమూరు సాహితీ అవార్డు వ్యవస్థాపకులు డా.భీంపల్లి శ్రీకాంత్ ఆహ్వానిస్తున్నారు. 2023లో ముద్రితమైన వచన కవితా సంపుటాల మూడేసి ప్రతులను పంపించాలి. డా.భీంపల్లి శ్రీకాంత్, 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్‌నగర్ - 509001, తెలంగాణ.. చిరునామాకు జనవరి 31లోపు కవులు తమ ప్రతులను పంపించాలి. ఎంపికైనవారికి రూ.5,116 నగదుతో పాటు జ్ఞాపికను అందజేస్తారు.

### ‘జలతంత్రి’ ఆవిష్కరణ

సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో 2024 జనవరి 28న ఆదివారం ఉదయం 10 గంటలకు తైదల అంజయ్య రచించిన కవిత్వం ‘జలతంత్రి’ ఆవిష్కరణ సభ జరగనున్నది. మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె.రంగాచారి సభకు అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కె.శివారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. డా.కోయికోటేశ్వరరావు పుస్తక పరిచయం చేస్తారు. నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, జి.దేవీప్రసాద్, కె.విరాహత్ అలీ, సిద్దెంకి గిరి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారు.